క్లుప్తంగా

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణం

రంగంపేట: పెదరాయవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం ఈ పనులను గ్రామ సర్పంచ్ బరగటి సుజాత, ఉప సర్పంచ్ మద్దిపాటి వీర్రాజు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకుడు బరగటి నాగేశ్వరరావులు పరిశీలించారు.

నాగంపల్లిలో వైద్యసేవలు



నాగంపల్లిలో ఇంటివద్ద వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: నాగంపల్లి సచివాలయంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 270 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి చికిత్స చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ జ్ఞాన సుందరి, ఏఎన్ఎం శిరోమణి, ఆశవర్కర్లు కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

బిక్కవోలు: గ్రామంలోని సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద అనపర్తికి చెందిన రమాదేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం జరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో డాక్టర్ బి.కృష్ణారావు వైద్య సేవలు అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

రంగంపేట: దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దొంతమూరు, బాలవరం, వీరంపాలెం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అన్నసమారాధన

బిక్కవోలు: పందలపాకలోని భద్రావతీ సమేత భావనారుషి స్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రథసప్తమి రోజు స్వామివారి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: విద్యుత్ స్తంభం నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన బొర్రా వీరభద్రశేఖర్ (38) ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌లో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. ఈ నెల 1న గోకవరంలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ నెట్‌వర్క్ వైరు సరి చేస్తుండగా పొరపాటున అతని చెయ్యి విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడికి గోకవరం ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. .

దాడి ఘటనపై కేసు

సీతానగరం: కేసు విచారణకు బుధవారం రాత్రి వస్తున్న సమయంలో రఘుదేవపురానికి చెందిన కోట శ్రీను, దుర్గ లోవరాజు, ప్రదీప్, పిల్లి వెంకన్నబాబు, రమేష్‌తో పాటుగా మరో 20 మంది స్టేషన్ దగ్గరలో కొట్టారని వంగలపూడి చెందిన కొత్తపల్లి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వీరబాబును కాళ్లతో తన్ని, రాళ్లతో కొట్టి, ఆరు కాసుల బంగారు చైన్ లాక్కున్నారని ఫిర్యాదులో తెలిపాడు.

కోట శ్రీను ఫిర్యాదుపై..

రఘుదేవపురానికి చెందిన కోట శ్రీను ఫిర్యాదు మేరకు వంగలపూడికి చెందిన కొత్తపల్లి వీరాబాబు, కసిరెడ్డి రాజాపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ గురువారం తెలిపారు. రఘుదేవపురం బట్టల దుకాణంలో ఉంటున్న దుర్గా లోవరాజు వద్దకు వంగలపూడికి చెందిన వీరబాబు వెళ్లి ఫోన్‌పే చేయాలని అడుగగా, ఎకౌంట్‌లో డబ్బులు లేవని చెప్పడంతో ఇరువురు కొట్టారని, వేరే షాపులో ఉన్న కోట శ్రీను వెళ్లగా అతని కొట్టి, తన మెడలోని ఎనిమిది కాసుల బంగారు గొలుసుకు లాక్కుని పారిపోయారని ఫిర్యాదులో తెలిపారన్నారు.

దాడిపై విచారణ

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల సమీపంలోని ఎయిర్‌పోర్టు రోడ్డులో మంగళవారం సాయంత్రం బెల్లపు డేవిడ్, ఆయన సతీమణి మేరీ విజయపై జరిగిన దాడి ఘటనపై విచారణ చేస్తున్నట్టు కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నిందితుల కోసం సీసీ పుటేజీల ఆధారంగా గాలింపు జరుగుతోందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గడపగడపకూ విశేష ఆదరణ



మల్లంపూడిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మల్లంపూడిలో కార్యక్రమం

రాజానగరం: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని మల్లంపూడిలో ఆయన ఆధ్వర్యంలో గురువారం ఆ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ విషయంలో ఎవరికైనా, ఏవిధంగానైనా అన్యాయం జరిగే నిర్భయంగా చెప్పాలని కోరారు. ఎస్సీ కాలనీలో శ్రీమంతుల విజయ అనే దివ్యాంగురాలిని కలుసుకుని యోగాక్షేమాలు అడిగారు. గతంలో అంత్యోదయ కార్డు ద్వారా 35 కిలోల బియ్యం ఇచ్చేవారిని, ఇప్పుడు ఆ కార్డును తీసేసి 20 కిలోలే ఇస్తున్నారని ఆమె చెప్పడంతో వాస్తవాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. అయితే వారివద్ద తగిన సమాచారం లేకపోవడంతో పరిశీలించి, న్యాయం చేస్తారంటూ ఆమెకు భరోసానందించారు. అలాగే లారీ ప్రమాదంలో కాళ్లు విరిగి, చికిత్స పొందుతున్న శీల అరవింద్ పరామర్శించారు.

వృద్ధాశ్రమానికి 104 సేవలు

మల్లంపూడి శివారులో వీరంపాలెంకు వెళ్లే దారిలోని ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు వైద్యసేవలు అందించే దిశగా 104 వాహనాన్ని వారంలో ఒకరోజు ఆశ్రమానికి పంపించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛనుతోనే జీవనం సాగిస్తున్నానని, పెద్దకొడుకులా ఆదుకుంటున్న సీఎం జగన్‌కి జన్మంతా రుణపడి ఉంటామని 70 ఏళ్ల మరియమ్మ ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిరిశెట్టి చక్రధర్, ఉపసర్పంచ్ పెంకి దుర్గారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు అనదాస సాయిరామ్, వేమగిరి కృష్ణ, పడాల బాబు, పేపకాయల శ్రీను, శ్రీమంతుల రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్నివర్గాలకూ లబ్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



గోకవరంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సచివాలయం-1, 2 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. మహిళలు, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఎమ్మెల్యే అడగ్గా డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జలజీవన్ మిషన్ పథకంలో గోకవరానికి రూ.కోటి మంజూరైందని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.8 లక్షలతో నిర్మించే డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, మంగరౌతు శ్రీను, గంధం గణేష్, షెడ్డు శ్రీను, ఉనుకూరి ఏసురత్నం, తహసీల్దార్ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డి రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



కొంకుదురులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని రూ.2.51కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కొంకుదురు గ్రామంలోని రూ.1.01కోట్లతో వాటర్ ట్యాంక్, తాగునీటి కుళాయిల పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కొంకుదురు, పందలపాక, ఆరికరేవుల, ఊలపల్లి, ఇలపల్లి గ్రామంలోని రూ.1.50కోట్లతో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో కల్చరల్ యాక్టివిటీస్ బిల్డింగ్‌లకు నిర్మాణలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ దిశగా ముఖ్యమంత్రి పాలన అందిస్తున్నారని అన్నారు. బలభద్రపురం గ్రాసీం ఇండస్ట్రీస్ ద్వారా చుట్టు ప్రక్కల గ్రామంలోని అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలోని గ్రాసీం ఇండస్ట్రీస్ యూనిట్ హెడ్ కృష్ణన్,హెచ్ఆర్ మురళి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి, కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, ఎంపీటీసీలు కొంకుదురు పి.వి.నల్లమిల్లి అమ్మిరెడ్డి, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్పుల విజేతగా నాని టీమ్



బాణసంచా విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న అనకాపల్లి శ్రీను

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామివారి కల్యాణ ఉత్సవంలో భాగంగా భారీ బాణసంచా కాల్పుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సామర్లకోట మండలం వేట్లపాలెం, జి.వేమవరం జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది. కనులు మిరుమిట్లు గొలిపే రంగులతో జరిగిన 9 రౌండ్ల పోటీల్లో 21 మార్కుల ఆధిక్యతతో వేట్లపాలెం నాని జట్టు విజేతగా నిలిచారు. న్యాయ నిర్ణేతగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సత్తి భగవాన్‌రెడ్డి వ్యవహరించారు. విజేత జట్టుకు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త అనకాపల్లి శ్రీను(ఎస్.వీ.ఎస్.ఎన్.రెడ్డి) కాసు బంగారం బహుమతిగా అందించాడు. గత కొన్నేళ్లుగా బాణసంచా విజేతకు ఆయనే బహుమతులు అందజేశాస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతా దొరబాబు, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, కర్రి రామసుబ్బారెడ్డి, ఉత్సవ కమిటీ మేడపాటి అమ్మిరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి జూమ్ కాన్ఫరెన్స్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: ప్రతిరోజు ఫేసియల్ బేస్‌డ్ రికగ్నైజ్ హాజరు సిస్టమ్(ఎఫ్ఆర్ఏఎస్)లో రోజుకు రెండు సార్లు బాధ్యతగా సకాలంలో అధికారులు హాజరు వేయాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయం కార్యదర్శులకు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు 10 గ్రామాల్లో నూరుశాతం పన్నులు వసూలు చేశారని, మిగిలిన గ్రామాల్లో త్వరగా పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింతగా మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, ఉమామహేశ్వరరావు, త్రినాథ్, మనోజ్, స్వామి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

గోకవరం: పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. మండలంలోని గోకవరం, గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు గురువారం జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాల్లో సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, పీఏసీ చైర్మన్లు కణితి శ్రీను, పి.చిన్ని, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టంపై ఫిర్యాదు

సీతానగరం: కూనవరానికి చెందిన అడపా వెంకటేశ్వర్లు, అడపా దుర్గ్ ప్రసాద్, నామవరానికి చెందిన చిందుల చిన్నోడు గొర్రెల మందతో తన కౌలుపొలంలో పంటను నష్టపరిచారని అదే గ్రామానికి చెందిన ఉంటి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. కాటవరంలోని చిట్టూరి ఆంజనేయులుకు చెందిన 10.50 ఎకరాలను సత్యనారాయణ కౌలు తీసుకుని పంట వేశాడు. రాత్రి సమయంలో వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, చిన్నోడులు గొర్రెల మందతో పంటను ధ్వంసం చేశారు. దీంతో సుమారు రూ.4 లక్షలు నష్టం కలిగింది. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ లోవకుమార్ తెలిపారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని టీడీపీ నాయకుడు బర్ల బాబూరావు గురువారం కోరారు. కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడారు. బౌద్ధ క్షేత్రాలను సంరక్షించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు.

బస్సులు ఆపడం లేదని విద్యార్థుల ఆందోళన

సీతానగరం: బొబ్బిల్లంక వద్ద ఆర్టీసీ బస్సులను ఆపివేసి గురువారం ఉదయం 8 గంటలకు విద్యార్థులకు ఆందోళనకు దిగారు. వారు సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామం నుంచి రాజమహేంద్రవరంలోని పలు కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే గ్రామంలో బస్సులు నిలపడం లేదన్నారు. ఉదయం 7 గంటల నుంచి రోడ్డుపై ఉంటున్నా సమయానికి కళాశాలలకు వెళ్లలేకపోతున్నామన్నారు. అనంతరం 9 గంటలకు విద్యార్థులు తమ నిరసన విరమించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

విధులకు ఆటంకం కలిగించారని కేసు

తమ విధులకు ఆటంకం కలిగించారని ఆర్టీసీ కండక్టర్ బీవీవీ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థి హేమంత్ కుమార్‌పై కేసు నమోదు చేశామని గురువారం హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం బొబ్బిల్లంక వద్ద ఆర్టీసీ బస్సును 45 నిమిషాలు నిలిపి, తమ విధులకు ఆటంకం కలిగించాడని కండక్టర్ ఫిర్యాదు చేశారన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాతలు డాక్టర్ ఘంటా గణేశ్వరరావు, రత్నం దంపతుల సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. సాయిబాబా వసతి మందిరం సేవా సమితి సభ్యులు 150 మంది పేదల ఇళ్లకు వెళ్లి నేరుగా పంపిణీ చేశారు.

కొబ్బరి బొండాలతో తులాభారం



కొబ్బరి బొండాలతో చిన్నారికి తులాభారం వేస్తున్న భక్తులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో చిన్నారులకు కొబ్బరి బొండాలతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చి వెలుగుబందకు చెందిన భక్తులు తమ ముగ్గురు చిన్నారులకు ఈ విధంగా తులాభారం వేశారు. మరికొందరు పట్టిక బెల్లంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్లతో గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈనెల 8వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి 7.30 గంటలకు శ్రీభూదేవి సమేత అనంత పద్మనాభస్వామికి ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో వ్యవస్థాపక ఆలయ ధర్మకర్త పరాశర రంగరాజ బట్టర్, దేవస్థానం మేనేజర్ రవి, అర్చక స్వాములు పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయస్థాయికి ఎదగాలి



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఫ్లడ్‌లైట్ వాలీబాల్ కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే

రంగంపేట: క్రీడా సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యార్థులు జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రమైన రంగంపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్ వాలీబాల్ కోర్టును గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎంపికైన దొడ్డిగుంట గ్రామానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావుని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కె. కృష్ణంరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లాలమ్మను దర్శించిన ఎమ్మెల్యే

పెదపూడి: గ్రామాల్లో కొలువై ఉన్న అమ్మవార్ల ఉత్సవాలు ఆలయ కమిటీలు భక్తులు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేండ్ర గ్రామంలో నర్ల వారి గొల్లాలమ్మని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ దేవతలు ఉత్సవాలు అందరు భక్తి శ్రద్ధలతో చేపట్టాలన్నారు. సర్పంచి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, ఎంపీటీసీ సభ్యుడు దొరబాబు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, గ్రామ కన్వీనర్ నర్లపెద్దకాపు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, రాజుపాలెం ఉప సర్పంచి నాగుమళ్ల వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణం గురువారం తెల్లవారు జామున 4 గంటలకు కనులు పండువగా జరిగింది. స్వామివారి కల్యాణం సందర్భంగా బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించారు. అనంతరం తెల్లవారు జామున వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భాజా భజింత్రులు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ప్రధాన అర్చకులు పి.గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. కల్యాణం సందర్భంగా గ్రామ పరిసర గ్రామాలతో పాటు, జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరైయ్యారు. స్వామి వారిని దర్శించుకుని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పీఏ అనంతాచార్యులు, ఈఓ సీహెచ్ వి.మణమూర్తి, పెదపూడి సోమేశ్వరస్వామి ఆలయం ఈఓ వడ్డాది సత్యనారాయణ, ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా భజేనారాయణుడి కల్యాణం



స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న బాలికలు

రంగంపేట: వడిశలేరు గ్రామంలో ఉన్న శ్రీదేవి-భూదేవి సమేత భజేనారాయణస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీ కృష్ణమాచార్యులు, కోరుకొండకు చెందిన నున్న శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబు రెడ్డి, ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు చేతుల మీదుగా దేవస్థానం తరపున స్వామి వారికి అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. కల్యాణానికి హాజరైన మహిళలకు దేవస్థానం తరపున పసుపు, కుంకుమ, తాంబూలం, రవిక అందించారు. కల్యాణం సందర్భంగా కాకినాడకు చెందిన నాట్య వేద కూచిపూడి నృత్య అకాడమీకి చెందిన 17 మంది బాలికలచే కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. నాట్య ప్రదర్శన అనంతరం నృత్యం చేసిన బాలికలకు ఆలయ కార్య నిర్వాణాధికారి రాంబాబు, చైర్మన్ వీర్రాజులు మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త వల్లూరి సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహయ్య ఆశయాలను కొనసాగించాలి



సింగంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

రంగంపేట: సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్య ఆశయాలను కొనసాగించాలని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ సూచించారు. నరసింహయ్య అమరత్వాన్ని స్మరిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం సింగంపల్లి గ్రామంలో సంతాప సభ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నంబి నరసింహయ్య గత నెల 22వ తేదీన కర్నూలు జిల్లా ఆదోని మండలం డానాపురంలో గుండెపోటుతో మరణించారన్నారు. ఆయన మృతి విప్లవోద్యమానికి తీరనిలోటన్నారు. భూమి, భుక్తి, విముక్తి, ప్రజల హక్కుల కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా నరసింహయ్య పోరాడారన్నారు. అంతకుముందు గ్రామంలో సంతాప ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, పీడీఎస్‌యూ విజృంభణ జిల్లా కార్యదర్శి కె.సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చక్క సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు



కానవరం సీతారామాలయంలో ఎమ్మెల్యే రాజా

రాజానగరం: కానవరంలోని సీతారాముల ఆలయాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పర్యటన

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం కోరుకొండ మండలంలో వివిధ అభివృద్ధి పథకాలను ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు గాడాలలో నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారు. 11 గంటలకు కోరుకొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్మించిన 12 అదనపు తరగతి గదులను, మధ్యాహ్నం 12 గంటలకు మండలంలోని పశ్చిమగానుగూడెంలో నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ క్లీనిక్, జలజీవన్ మిషన్‌లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులను, 12.45 గంటలకు కోరుకొండ ఎస్సీ కాలనీలో నిర్మించిన నూతన పైప్‌లైన్‌ను, మధ్యాహ్నం 1.05 గంటలకు కోటికేశవరంలో జలజీవన్ మిషన్‌లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభిస్తారు. అనంతరం 3 గంటలకు రాజానగరం మండలం మల్లంపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.